క్లుప్తంగా

కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు



అలంపూర్: ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సోమవారం వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు జయరాజు జిల్లా కేంద్రంలో డీపీఓ శ్యామ్‌కు ఫిర్యాదు చేశారు. అలంపూర్ చౌరస్తాలోని ఒక వెంచర్‌ను డెవలప్‌మెంట్ చేయకముందే మార్టిగేజ్ ప్లాట్లు అక్రమంగా రిలీజ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీటీసీపీ అప్రూవల్‌తో వెంచర్ వేశామన్నారు. గ్రామ పంచాయతీకి 10 శాతం ల్యాండ్ డాక్యుమెంట్, పంచాయతీ భూమిని సైతం మార్టిగేజ్ చేసినట్లు తెలిపారు. వెంచర్‌లో డీటీసీపీ ప్రకారం బీటీ రోడ్లు, వాటర్ లైన్, విద్యుత్ సౌకర్యం, ఫుట్‌పాత్, కాంపౌండ్ వాల్, డ్రెయినేజీలు, ఇతర పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ చేసిన తర్వాత మార్టిగేజ్ రిలీజ్ చేయాల్సి ఉందని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి



అయిజ: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను వినియోగించుకొని ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఐని కోరారు. లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బుద్దాదిత్యమోహంతి బెదిరింపులు చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారని, దానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకట్ ఫిర్యాదు చేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



అయిజ: మండలంలోని వెంకటాపురంలో సోమవారం అదే గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని సుస్మితను ఆమె నివాసంలో బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. సుస్మిత 2024 నీట్‌లో ప్రతిభ కనబరిచి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సాటు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సుస్మిత తల్లిదండ్రులు దేవదాసు, బుజ్జమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

శాంతినగర్: వానాకాలంలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా ముందస్తు టీకాలు వేయించాలని డాక్టర్ పుష్పలత రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు టీకాలు వేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతు గాలికుంటు వ్యాధి సోకితే పశువులు అనారోగ్యానికి గురవుతాయని ముందస్తుగా టీకాలు వేయించాలని రైతులకు వివరించారు. గ్రామంలోని 31 ఆవులు, 95 ఎద్దులు, 172 గేదెలకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. మంగళవారం జూలెకల్‌లో పశువులకు టీకాలు వేయనున్నట్లు డాక్టర్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎర్రవల్లి: మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన తెలుగు గోకారి, ఉప్పరి నిర్సింగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎన్నార్టై సోమనాద్రి సోమవారం మృతదేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పెద్ద సవరన్న, భాస్కర్, వెంకటన్న, బీచుపల్లి, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పథకాలపై అధ్యయనం



బస్వాపురంలో వాలీబాల్ ఆడుతున్న ట్రైయినీ ఐఏఎస్ అధికారులు

గద్వాల: క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలపై అధ్యయనం, అమలు తీరుపై అవగాహన పెంపొందించుకునేందుకు ఎంసీఆర్, హెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్ నుంచి జిల్లాకు వచ్చిన 25 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ (ఏఐఎస్) సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారులతో కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా భౌగోళిక స్థితి, నియోజకవర్గాలు, మండలాలు, చేనేత పట్టు చీరలు, అలంపూర్ ఆలయం, ఇరిగేషన్ ప్రాజెక్టులు, చారిత్రక కోటల వంటి ముఖ్యంశాలపై అవగాహన కల్పించారు. 25 శిక్షణ అధికారులను 5 గ్రూపులుగా ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులను కేటాయించారు. ధరూర్ మండలంలోని ఉప్పేర్, మానవపాడులోని కల్‌కుంట్ల, ఇటిక్యాల మండలం కోదండాపురం, మల్దకల్ మండలంలోని పెద్దపాడు, ఉండవెల్లి మండలంలోని బస్వాపురం, గద్వాల, అలంపూర్ మున్సిపాలిటీల్లో వారు పర్యటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీసీఈఓ కాంతమ్మ, ట్రెయినీ ఐఏఎస్‌లు తదితరులు ఉన్నారు.

ఘన స్వాగతం

ఎర్రవల్లి: మండలంలోని కోదండాపురంలో సోమవారం శిక్షణ నిమిత్తం వచ్చిన సివిల్ సర్వీస్ అధికారులకు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బంది ఘన స్వాగతం పలికారు. శిక్షణలో భాగంగా 2021వ బ్యాచ్‌కు చెందిన లోకేష్‌యాదవ్, డింపల్ యాదవ్, బసవరాజ్, ఎం వాలికర్, నిఖితయాదవ్‌తో పాటు 2022వ బ్యాచ్‌కు చెందిన ఇంద్రజిత్ గ్రామానికి చేరుకున్నారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు గ్రామంలో బసచేసి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను సందర్శించడంతో పాటుగా గ్రామస్తులతో ప్రభుత్వ పథకాల అమలు తీరును గురించి చర్చించనున్నట్లు వారు తెలిపారు.

బస్వాపురం గ్రామానికి..

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురం గ్రామానికి ఐదుగురు ఐఏఎస్, ఐపీఎస్ క్యాడర్ అధికారులకు ఎంపీఓ తిరుపతన్న, పంచాయతీ కార్యదర్శులు ఘన స్వాగతం పలికారు. సోమవారం బస్వాపురం గ్రామానికి లోకేష్‌కుమార్, రామకృష్ణ సరన్, ప్రతిక్ గహ్లట్, అటుల్‌కుమార్ సింగ్, హిమాన్షు త్యాగి అధికారులు పంచాయతీ పరిధిలో మూడు రోజులు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం వాలీబాల్ ఆడుతూ యువతతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఏపీఓ సౌజన్య, ఏపీఎం కోటీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కలుకుంట్లకు..

మానవపాడు: మండలంలోని కలుకుంట్లను ట్రెయినీ కలెక్టర్లు కె.రాజీవ్ ఎన్.వల్లీ, ప్రసన్నకుమార్, సయాలి అశోక్ గైక్వాడ్, విజయలద సందర్శించారు. ఈ నెల 25 వరకు గ్రామంలో వారు పర్యటిస్తారని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు.

మల్దకల్: శిక్షణలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గ్రామీణ స్థాయిలో పరిస్థితులపై అవగాహన పెంచుకునేందుకు మల్దకల్ మండలం మద్దెలబండ పెద్దతండాలో సోమవారం పర్యటించారు. ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ పొందుతున్న పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, వికాస్, ఆదామ్ మొయిద్దీన్, పుష్కరవరమ, హర్షిత్ కుమార్, అలావత్ గ్రామీణ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులు, మౌలిక వసతులు, విద్యా, ఆరోగ్యంపై వివరాలు నమోదు చేసుకోనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు ఉన్నారు.



మద్దెలబండ పెద్దతండాలో ట్రైయినీ కలెక్టర్, ఐపీఎస్‌లు

నీటి కోసం విద్యార్థుల కష్టాలు



కొళాయి వద్ద ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థులు

రాజోళి: తాగు, వాడుకునే నీటి కోసం కొత్త రాజోళి న్యూ ప్లాట్స్ పాఠశాల విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాథమిక పాఠశాలలో వంద మంది పైగానే విద్యార్థులు ఉన్నారు. వారికి మధ్యాహ్న భోజనం అనంతరం, నీరు తాగేందుకు ఒక్కటే కొళాయి ఉండటంతో వారి నీటి అవసరాలు తీరడం లేదు. గతంలో చాలా కొళాయిలు ఉన్నప్పటికీ.. అవి చెడిపోవడంతో కనీస మరమ్మతు చేసే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. ఉన్న ఒక్క కొళాయి వద్దే విద్యార్థులు ఒకరినొకరు తోసుకుంటూ ప్లేట్లు కడుక్కోవడం, నీరు తాగడం చేస్తున్నారు. దీంతో వారు కిందపడి గాయాలపాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొళాయిల వద్ద నీరు రాకపోవడంతో హోటళ్లు, షాపుల్లో నీరు తాగుతున్నారని వారు వాపోతున్నారు. గతంలో ఈ సమస్యపై స్థానిక అధికారులకు, స్పెషల్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు అంటున్నారు.

విధుల్లో అంకితభావంతో పనిచేయాలి



జూనియర్ లెక్చరర్‌ను సన్మానించిన మేరమ్మ, మధుసూదన్‌రెడ్డి దంపతులు

అయిజ: జూనియర్ లెక్చరర్‌గా నియమితులైన రెహ్మతుల్లాను సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ మేరమ్మ దంపతులు పట్టణంలోని వారి నివాసంలో శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా మేరమ్మ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పట్టుదలతో చదువుకున్న రహ్మతుల్లా ఇటీవల నిర్వహించిన జూనియర్ కళాశాలల స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి, మల్టీ జోన్ (దక్షిణ తెలంగాణ) స్థాయిలో మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారన్నారు. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడం హర్షించతగిన విషయమని కొనియాడారు. విధుల్లో అంకితభావంతో పనిచేసి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

ఎస్‌బీఐ చైర్మన్‌కు సన్మానం



వనపర్తి టౌన్: ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులును సోమవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాత గంజ్‌లోని ఆయన నివాసంలో సన్మానించారు. వనపర్తివాసి అయిన శ్రీనివాసులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా ఎన్నిక కావడం వనపర్తికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, చిత్తారి ప్రభాకర్, బాశెట్టి శ్రీనివాసులు, రాము, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



అలంపూర్: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేద్దామని సీపీఎం నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని ఫ్లెటీవర్ కూడలిలో సీపీఎం జిల్లా మూడో మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25, 26 తేదీల్లో సీపీఎం జిల్లా మూడో మహాసభలు నిర్వహిస్తున్నారని కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, చిన్న నరసింహ, స్వాములు, హర్ష గౌడ్, సురేష్, హనుమంతు, మద్దిలేటి, రాముడు, రాజు తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చుదాం

గద్వాల అర్బన్: మాదక ద్రవ్య రహిత జిల్లాగా గద్వాలను మార్చడమే లక్ష్యమని డ్రగ్ అడిక్షన్ వలంటీర్ కృష్ణయ్య అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో గంజిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, పొగాకు, గంజాయి, హెరాయిన్, కొకైన్, అల్ఫోజోలం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడితే గుర్తిస్తే 14446 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ ఉమెన్ హబ్ నాగరాజు, ఆర్‌డీఎస్ విద్యులత, అంగన్‌వాడీ టీచర్లు శారద, జయమ్మ ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 24మంది గర్భిణులు వైద్య పరీక్షలు హాజరయ్యారన్నారు. గర్భిణుల నుంచి రక్తపరీక్షల కోసం బ్లడ్ శాంపిల్స్ సేకరించి టీ హబ్ వాహనం ద్వారా గద్వాలకు పంపించినట్లు తెలిపారు. రక్తహీనత సమస్యలు రాకుండా పోషకాహారం, ఐరన్‌మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెలెన్, అక్కమ్మ, చంద్రన్న, తిరుమల్‌రావు, జయమ్మ, దేవమ్మ, సోనీ తదితరులు పాల్గొన్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహిద్దాం

అయిజ: గ్రామీణ యువతకు క్రీడల పట్ల చైతన్యం కల్పిద్దామని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ వెంకటయ్య, ఎంఈఓ రాములు కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతు గ్రామీణ యువతకు క్రీడలపై చైతన్యం చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమం గ్రామ స్థాయిలో ఈనెల 24 వరకు, మండల స్థాయిలో 26 నుంచి 30 వరకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రాలపై పెత్తనానికే జమిలి ఎన్నికలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

అలంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయించడానికే జమిలి ఎన్నికల తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, జీకే ఈదన్న అన్నారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నిక రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే బీజేపీ నాయకులు ఒకే దేశం ఒకే కులం అనగలరా అని ప్రశ్నించారు. జమిలి విధానం తీసుకొస్తే రాష్ట్రాలకు ఉన్న కొద్దిపాటి హక్కులు లేకుండా పోతాయన్నారు. బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడతుందని ఆరోపించారు. ప్రశ్నించే మేధావులను జైలుకు పంపి వేధిస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో చమురు ధరలు తగ్గుతున్నా.. దేశంలో ఇంధన ధరలు తగ్గడం లేదన్నారు.

హామీల అమలులో విఫలం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. రైతు భరోసా, మహిళలకు, రైతు కూలీలకు ఆర్థిక సాయం తక్షణమే అందజేయాలని కోరారు. ఈనెల 25, 26 తేదీల్లో సీపీఎం జిల్లా మూడో మహాసభలు జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తారని, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకటస్వామి, నరసింహ, నాగరాజు, అయ్యప్ప తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న కురువ విజయ్‌కుమార్

గద్వాల అర్బన్: చిన్నోనిపల్లి రిజర్వాయర్ ప్యాకేజీ 101లో చాగదొనలో 244ఎకరాల ప్రభుత్వ భూమిని నష్టపరిహారం పేరుతో కమీషన్లు, ప్యాకేజీల కోసం పార్టీ మారిన స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా భూములు కోల్పోయిన రైతులను అడ్డుపెట్టుకొని 244 ఎకరాల ప్రభుత్వ, బంజారా భూములు ఎలాంటి వ్యవసాయం చేయని వారి పేర్లను రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లుగా చూపించి నష్టపరిహారం డబ్బులను దోచడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పనులకు అధికారులు సహకరిస్తే భవిష్యత్‌లో జైలు పాలు కావడం ఖాయమన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా భూములు కోల్పోయిన ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో లోకాయుక్త, విజిలెన్స్ అధికారులు, సీఎస్ శాంతికుమారిని కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలక్ష్మండ మల్లికార్జున్, బీచుపల్లి, రాము, దానం, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



గట్టులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధరూరు: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రభారి బొక్క బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మారుమూల గ్రామాల ప్రజల కష్టాలను పట్టించుకోలేదన్నారు. 10 ఏళ్ల బీజేపీ పాలనలో నరేంద్ర మోడీ అనేక పథకాలు తీసుకొచ్చి పేదలకు మేలు చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రాజేందర్, నాయకులు శివారెడ్డి, నిమిరెడ్డి, దేవదాసు, కిష్టన్న, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొక్క బాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ దేశ ప్రజల అభ్యున్నతికి నిరంతరం పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు దేవదాసు, హనిమ్రెడ్డి తదితరులు ఉన్నారు.

గట్టు: బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. సోమవారం గట్టు మండల కేంద్రంలోని మధుసూదనరావు నివాసంలో బీజేపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలన్నారు. అలాగే సభ్యత్వ నమోదును గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. బాలరెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, నల్లారెడ్డి, సురేష్, మోహన్‌చంద్ర, వీరశేఖర్‌గౌడ్, సంజీవనాయుడు, వెంకటేష్, నర్సింలు, శ్రీరాంలు, పాండునాయక్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: 11కేవీ టౌన్-2 పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11:30 గంటల నుంచి 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, సుంకులమ్మ మెట్టు, బుర్దపేట, గంటవీధి, రాజావీధి, గాంధీచౌక్, అశోక్‌నగర్, కృష్ణారెడ్డి బంగ్లా, శేరెల్లివీధి కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసులపై కుక్కదాడి

అలంపూర్: సాధారణ గస్తీకి వెళ్లిన పోలీసులపై కుక్కదాడి చేసిన ఘటనలో ఏఎస్‌ఐకు స్వల్ప గాయమైంది. వారు తెలిపిన వివరాల ప్రకారం అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఎస్‌ఎం బాషా, హెడ్‌కానిస్టేబుల్ వీరన్న ఆదివారం రాత్రి గస్తీకి వెళ్లారు. పోలీస్ వాహనంలోంచి దిగుతున్న క్రమంలో ఒక కుక్క ఏఎస్‌ఐపైకి దూసుకొచ్చింది. దాన్ని నివారించే క్రమంలో ఏఎస్‌ఐకు రెండు గాట్లు పడటంతో తక్షణమే స్థానిక ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నట్లు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన నాగశేషులు, శివకు గతంలో పాత కేసు ఉండడంతో రాజీ కావాలని ఆదివారం రాత్రి చర్చలు చేశారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి గొడవకు దారి తీయడంతో నాగశేషులుపై శివ, అతడి తల్లిదండ్రులు లక్ష్మీదేవి, మద్దిలేటి దాడి చేసినట్లు తెలిపారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై సోమవారం ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులను మోసం చేస్తే కేసులు తప్పవు

రాజోళి: రైతులను మోసం చేసే వ్యాపారులు, దళారులపై కేసులు తప్పవని ఎస్‌ఐ జగదీష్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళారులు, వ్యాపారులు పత్తిని కొనేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రైతులు ఎవరికైతే పత్తిని అమ్ముతున్నారో వారి దగ్గర నుంచి రశీదు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో బాండ్ పేపర్ మీదైనా పత్తి అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలను పొందుపరచాలని సూచించారు. అలాంటి ఆధారాలతో పాటు వే బిల్లులు కూడా ఉంటే రైతులను మోసం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కాగా వ్యాపారులు కూడా టెక్నాలజీని అడ్డు పెట్టుకుని పత్తి రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. తాగడానికి, వాడుకోవడానికి నీరు లేదని, నిధులు మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ లేదన్నారు.

స్కూల్ బస్సు, కారు ఢీ



అలంపూర్: విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును కారు ఢీకొట్టిన ఘటనకు సోమవారం పుల్లూర్ టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న ఓల్డ్ స్కంద నుంచి ఒక ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు రావడానికి జాతీయరహదారిపై యూటర్న్ తీసుకుంటుంది. అదే సమయంలో ఢిల్లీ నుంచి కేరళ వెళ్తున్న కారు స్కూల్ బస్సుకు వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు, కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

ఆత్మకూర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలని పదిశాతం ప్లాట్లు, చెరువు భూములను రక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, కమిషనర్ శశిధర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఐదు వందలకు పైగా ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని, అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూములు సైతం ఆక్రమణలకు గురయ్యాయని, చెరువు వద్ద అక్రమ కట్టడాలు వెలిసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పలుదఫాలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సైతం సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, గంగాధర్, షంషీర్, రఫీక్, నిరంజన్, వంశీ, శ్రీకాంత్, రమేష్‌యాదవ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

అమరచింత: మున్సిపాలిటీలోని కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, గ్రామకంఠం భూమిని కాపాడాలంటూ కలెక్టర్ ఆదర్శ్‌సురభికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా గ్రామ కంఠం స్థలంలో మహిళలు సామూహిక మరుగుదొడ్లుగా వాటిని వినియోగించుకుంటున్నారని, మహిళల సౌకర్యం కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించారన్నారు. ప్రస్తుతం రూ.కోట్ల విలువ గల స్థలాన్ని స్వచ్ఛంద సంస్థ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మండిపడ్డారు. వాటిని ఆధారాలతో బీజేపీ బయటపెట్టినా.. మున్సిపల్ అధికారులు నేటికీ స్థలంలో ప్రభుత్వ స్థలం అంటూ సూచికబోర్డును ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజల సంక్షేమం కోసం వాటిని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మేర్వరాజు, రాకేశెట్టి తదితరులు పాల్గొన్నారు.